

# అప్పడాల అసెంబ్లీ

సూరమ్మగారి పిల్లలు వెళ్ళి ఇంటింటికీ చెప్పొచ్చారు. "మా ఇంట్లో ఇవ్వాళ అప్పడాలు వత్తుతున్నారు; మీరు రావలసింది" అని.

బజార్లో ఆడంగులు వంటలు త్వరత్వరగా ముగించారు. మొగవాళ్ళకి, పిల్లలకి వెంట వెంటనే వడ్డించారు. తామూ చకచకా రెండు మెతుకులు గతికి పీట, అప్పడాల కఱ్ఱతో సూరమ్మ గారింటికి బయలుదేరారు. వీధి చివరనున్న శాంతమ్మ తనూ వెళ్ళనా వద్దా అని ఆలోచనలో పడింది. సుబ్బమ్మ వచ్చి తీరుతుంది. దాని మొహం చూస్తే వళ్ళు మండుతుంది. తన్ని నీలాటి రేవులో ఎంతలేసి మాటలంది! వెళ్ళకూడదని నిశ్చయించుకుంది. ఇంతలో చట్టుక్కున జ్ఞాపకం వచ్చింది. ఇవ్వాళ సుబ్బమ్మ కునికినపాడు పోతానన్న'దని. ఇంకేం! సంతోషంగా లేచి పనులు ముగించుకుని వంటింటికి గొళ్ళెం పెట్టి కుక్కవస్తుందేమో జాగర్త అని భర్తకి చెప్పి పీట, అప్పడాలకఱ్ఱతో సూరమ్మ యింటికి బయలుదేరింది.

శాంతమ్మ గుమ్మంలో అడుగుపెడ్తుంటే సుబ్బమ్మ గొంతు విన్పించింది.

సుబ్బమ్మ చెప్తోంది. "కునికిన పాడు వెళ్దామనుకొన్నానా .... పడవ రేవు దాటిపోయింది. ఎండవేళ ఎందుకులే అని మానేశాను. ఏనాటికి ఎక్కడ ప్రాప్తమో!" శాంతమ్మ వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనుకుంది కాని ఇంతలో ఎవరో తను రావటం చూసి "అక్కడే నుంచున్నావేం? లోపలికి రా" అన్నారు. ఇక తప్పక లోపలికెళ్ళింది. శాంతమ్మని చూసీ చూడగానే సుబ్బమ్మ ముఖం ముడుచుకుపోయింది. మూతి అష్టవంకర్లు తిప్పింది, శాంతమ్మ పట్టించుకోనట్లుగా ఓ పక్క కూర్చుంది.

అప్పడాల పిండి పళ్ళెంలో ముద్దగా మధ్యన ఉంది. తలా కాస్త పిండి తీసుకుని అప్పడాలు వత్తుతున్నారు. వత్తుతూ వత్తుతూ వెంకాయమ్మ అందుకుంది "నీకు జ్ఞాపకం ఉందో - మా రాముడి పెళ్ళికి వెయ్యి అప్పడం వత్తాం, పది బూడిద గుమ్మడికాయల వడియాలు పెట్టాం."

వెంకాయమ్మకి ఎప్పుడూ తన్ని గురించి గొప్పలు చెప్పుకోటమే. ఇది సుబ్బలక్ష్మికి నచ్చదు. టక్కున ఎదురొచ్చింది. "వెయ్యి అప్పడమా వల్లకాడా! మనవేగా వొత్తింది. ఐదొందలకి మించి ఉండవు."

వెంకాయమ్మ చురచురచూసి "నీది పాడు నోరే! పోనీ ఓ వంద తక్కువే అనుకో. పెళ్ళి గురించి చెప్తుంటే వల్లకాడా అంటావా?"

"ఓ యబ్బ! నా నోరల్లాంటిది - మేం చదువుకున్నామా పాడా?" అంది సుబ్బలక్ష్మి. వెంకాయమ్మ సుమతీ శతకం దాకా చదువుకుంది. సుబ్బలక్ష్మి స్కూలుకు వెళ్ళలేదు. వెంకాయమ్మ తిరిగి అందుకోబోతే ఎవరో సర్దేశారు.

అప్పడాలు వత్తుతోందేకాని శాంతమ్మ సుబ్బమ్మని ఎలాగైనా సాధించి నలుగుర్లో నాలుగూ పెట్టాలని ఆలోచిస్తోంది. సుబ్బమ్మ కూడా ఆ పట్టుమీదే ఉంది. సుబ్బమ్మ ఆ చివర్నించి అంది. "మనం అనుకుంటాంగాని మనుషులంతా ఒకటి గాదమ్మా! తగాదాపెట్టి సంతోషించేవాళ్ళు చాలామంది వుంటారు."

చెప్పడమైతే అందరికీ చెప్పింది. కాని ఎవర్ని గురించో చెప్పలేదు. చెప్పటమెందుకు, బంతివిసిర్తే టక్కున అందుకున్నట్లు శాంతమ్మ ఫెడేల్మని

సమాధానం చెప్పింది.

"తంపులు పెట్టి తన్నుకుంటే చూద్దామనుకునే దాన్నా?"

"నేను తగాదాలు పెడ్తానా?"

"నేను తంపులు పెడ్తానా?"

"నన్ను చూస్తేచాలు కళ్ళలో నిప్పులు పోసుకుంటావు. నేను చంద్రహారం చేయించుకొన్నాననేగా నీ మంట.'''

'ఓ యబ్బ! నగలు! వెలిగిపోతోంది ఐశ్వర్యం. మొన్న పెళ్ళిలో బూజం బంతి పాట నేను పాడానని కదూ నీ ఏడుపు?"

'ఆహా ఏమి పాట! వినలేక చచ్చాం.'

'చస్తే ఇక్కడికి దెయ్యమై వచ్చావా?'

'నన్ను చావమంటావా పాపిష్టిదానా'

'నన్ను దెయ్యమంటావా రాక్షసీ.'

అప్పడాల కర్రలు తీసుకుని ఒకళ్ళమీదికి ఒకళ్ళు లేచారు. మిగతా ఆడవాళ్ళు మధ్యలో కొచ్చి యుద్ధమాపారు. "దాని పుటకే అంత." "దాని వంశమే అంత" ఇంకా తిట్టుకుంటున్నారు సుబ్బమ్మ, శాంతమ్మ. ఓ ముసలమ్మ మధ్యకొచ్చి "ఇన్నేళ్ళొచ్చినాయి సిగ్గులేదూ.." అని ఇద్దర్నీ విడదీసి కూర్చోబెట్టింది. నోరెత్తారంటే పీటతో నెత్తి బాదుతానంది. సుబ్బమ్మని తూర్పుముఖంగా శాంతమ్మని పడమట ముఖంగా తిప్పి కూర్చోబెట్టింది. మాటాడకుండా అప్పడాలు వత్తమని శాసించింది. సుబ్బమ్మ, శాంతమ్మ మౌనంగా వత్తుతున్నారు. ముసలమ్మ అంది "ఎవరన్నం వాళ్ళు తింటున్నారు. ఏళ్ళు పైకొచ్చాయి. పిల్లలు ఎదిగొచ్చారు. కలిసికట్టుగా బతకడం ఎప్పటికొస్తుంది?" సుబ్బమ్మా, శాంతమ్మా మాట్లాడకుండా వొత్తుతుంటే ఒకళ్ళమీద ఒకళ్ళకి కోపం దిగిపోయింది. తిట్టుకున్నందుకు సిగ్గుపడిపోయారిద్దరూ ... అప్పడాలన్నీ అయిపోయాక తలాకాస్త అప్పడాల పిండి తీసుకుని ఎవరిదోవన వాళ్ళు ఇళ్ళకెళ్ళారు.

మ్మ వేడి అన్నంలో నెయ్యివేసి అప్పడాలపిండి భర్తకి వడ్డించి "ఏవండీ! పిల్లని సుబ్బమ్మ కొడుక్కిస్తే ఎలా ఉంటుంది?" అంది. *